


నీట్ ప్రవేశ పరీక్షలో ప్రనూషకు 640 మార్కులు



ఆమనగల్లు, జూన్ 5 : వైద్య విద్య ప్రవేశానికి జాతీయస్థాయిలో నిర్వహించిన నీట్-2024 ఫలితాల్లో ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన సీత ప్రనూష ప్రతిభ కనబరిచింది. సంతోష-కృష్ణ దంపతుల కుమార్తె అయిన ప్రసూన 720 మార్కులకుగాను 640 మార్కులు సాధించి సత్తా చాటింది. దాంతో ఆమెను పలువురు అభినందించారు.

వాడిన గులాబీ



బీఆర్ఎస్ పార్టీకి తెలుగుదేశం పరిస్థితి రానుందా..? క్రమంగా ఆ పార్టీ తన ప్రాభావాన్ని కోల్పోతుందా? అన్న చర్చ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సర్వత్రా సాగుతోంది. పది సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తర్వాత భారీగా ఓట్లను కోల్పోవడం, పార్లమెంట్ ఎన్నికల్లో మరింత భారీగా ఓట్లకు గండిపడడంతో ఆ పార్టీకి ఇక మనుగడ కష్టమేనని అంతా భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆ పార్టీ మెజారిటీ ఎమ్మెల్యే స్థానాలను, ఓట్లను సాధించింది. కానీ, పార్లమెంట్ ఎన్నికల నాటికి ఆ పార్టీకి ఒక్క సీటూ రాకపోవడంతో పాటు ఏకంగా 11.66లక్షల ఓట్లు కోల్పోయిందంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో అర్థమవుతోంది.

టీడీపీ తరహాలోనే బీఆర్ఎస్ పతనం!

- 11.66లక్షల ఓట్లు కోల్పోయిన బీఆర్ఎస్
- తాజా పరిణామాలతో ఎమ్మెల్యేల పక్కచూపులు
- చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాలను కైవసం చేసుకున్న బీజేపీ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఉమ్మడి జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు బీజేపీకి కలిసి రాగా ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఆశలు గల్లంతు చేశాయి. చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్‌ను బీజేపీ తుక్కుతుక్కుగా ఓడించింది. పార్లమెంట్ ఎన్నికలు బీజేపీ శ్రేణుల్లో జోష్‌ను నింపగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో కేడర్‌ను తీవ్ర నిరాశపరిచాయి. ముఖ్యంగా ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ భవిష్యత్తు ఆశలు అడియాసలయ్యాయి. దశాబ్దకాలం కిందట జరిగిన సాధారణ ఎన్నికల అనంతరం తెలుగుదేశం పార్టీ ఎలా పతనమైందో అచ్చం అలానే ఇపుడు బీఆర్ఎస్ పరిస్థితి అలానే మారింది. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాను కంచుకోటగా మలుచుకున్న టీడీపీ 2014 ఎన్నికల తరువాత కోలుకోని విధంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో టీడీపీకి 8 అసెంబ్లీ స్థానాలు లభించాయి. తరువాత ఆ పార్టీ క్రమేపీ బలహీనపడి కోలుకోలేదు. ఇపుడు టీఆర్ఎస్ పరిస్థితి కూడా అలానే కనిపిస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ 10 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంది. అయితే అధికారం కోల్పోవడంతో బీఆర్ఎస్ రోజు రోజుకు బలహీనపడుతోంది. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ తేలిపోయింది. కనీవిని ఎరుగని రీతిలో ఆరు నెలల కాలంలోనే బీఆర్ఎస్ గణనీయంగా ఓటు బ్యాంకు కోల్పోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన తనయుడు, మాజీ మంత్రి కేటీఆర్ విస్తృతంగా ప్రచారం చేసినా ఒక్క సీటూ దక్కించుకోలేకపోయారు. కనీసం రెండో స్థానం కూడా బీఆర్ఎస్‌కు దక్కలేదు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈ రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో బీఆర్ఎస్ 11.66లక్షల ఓట్లు కోల్పోవడం గమనార్హం. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ కంటే కేవలం 4.8లక్షల ఓట్లు అధికంగా వచ్చాయి. ఈ 4.8లక్షల ఓట్లే రాష్ట్రంలో అధికారం తారుమారు కావడానికి కారణమయ్యాయి. అలాంటిది ఉమ్మడి జిల్లాలోనే ఇపుడు బీఆర్ఎస్ ఆరు నెలల కాలంలో దీనికి రెట్టింపు కంటే అధికంగా ఓట్లు కోల్పోవడం చూస్తే భవిష్యత్తులో బీఆర్ఎస్ కోలుకునే అవకాశాలు అంతంత మాత్రమేనని చెప్పాలి. అధిక సంఖ్యలో ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ బీఆర్ఎస్ పార్టీ ఈ రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక పరిస్థితి రోజు రోజుకు దిగజారుతుండడంతో ఆ పార్టీకి సంబంధించిన మెజారిటీ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపారు. దీంతో బీజేపీకి ఈ ఎన్నికల్లో గణనీయంగా ఓట్లు లభించాయి.

ఎమ్మెల్యేలు ఉంటారా?

తాజాగా మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎక్కువ కాలం ఆ పార్టీలో కొనసాగే అవకాశాలు కనిపించడం లేదు. బీజేపీ ఓటు బ్యాంకు గణనీయంగా పెరగడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఇక తన వైపు తిప్పుకోవాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలతో సంప్రదింపులు కూడా చేపట్టారు. గతంలో టీడీపీ ఎమ్మెల్యేలంతా బీఆర్ఎస్‌లో మూకుమ్మడిగా చేరిన విధంగానే ఇపుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా మూకుమ్మడిగా చేరనున్నట్లు ప్రచారం సాగుతోంది. మునిగి పోయే నావలో ఇక ఎక్కువ కాలం ఉండలేమని కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సన్నిహితుల వద్ద ప్రస్తావిస్తున్నారు. ఇదే జరిగితే బీఆర్ఎస్ మరింత పతనమయ్యే అవకాశం ఉంది.

ఇంతలో ఎంత తేడా!

గత అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్‌కు 40.85శాతం ఓట్లు రాగా కాంగ్రెస్ పార్టీకి 35.2శాతం, బీజేపీకి 19.37 శాతం ఓట్లు వచ్చాయి. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 10.80శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. కాంగ్రెస్‌కు 38.44శాతం ఓట్లు రాగా బీజేపీకి అనూహ్యంగా 48.77శాతం ఓట్లు వచ్చాయి. ఈ నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే దాదాపు 30శాతం ఓట్లు బీఆర్ఎస్ కోల్పోయింది. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల పరిధిలో బీఆర్ఎస్‌కు 47శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 30.05శాతం, బీజేపీకి 20.56శాతం ఓట్లు లభించాయి. ఈ పార్లమెంట్ ఎన్నికలో పరిస్థితి పూర్తిగా తారుమారైంది. ఒక్క ఎమ్మెల్యే కూడా లేకున్నా బీజేపీ రికార్డు స్థాయిలో ఓట్లు కొల్లగొట్టింది. మల్కాజిగిరి పార్లమెంట్‌లో బీజేపీకి 51.64శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 31.24శాతం, బీఆర్ఎస్‌కు 15.65శాతం ఓట్లు లభించాయి. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా మల్కాజిగిరి పార్లమెంట్ చరిత్రలో బీజేపీకి 3.91లక్షల పైచిలుకు ఓట్ల మెజార్టీ లభించింది. ఇక్కడ కూడా బీఆర్ఎస్ ఆరు నెలల కాలంలోనే దాదాపు 31శాతానికి పైగా ఓట్లు కోల్పోయింది.

కమల వికాసంతో కాంగ్రెస్‌కు ముచ్చెమటలు

తాజా పరిణామాలతో అధికార కాంగ్రెస్‌కు ముచ్చెమటలు పడుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ఉమ్మడి జిల్లాపై పూర్తిస్థాయి పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ పార్టీకి బీజేపీ కొరకరాని కొయ్యగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి దాదాపు 10.46 లక్షల ఓట్లు అధికంగా వచ్చాయి. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ కంటే 5.65లక్షల ఓట్లు అధికంగా రావడం గమనార్హం. దీంతో బీజేపీ ఉమ్మడి జిల్లా అంతటా దండిగా ఓటు బ్యాంకు సంపాదించించి అధికార పార్టీకి సవాల్‌గా మారింది. కాంగ్రెస్‌లోకి మాజీ మంత్రితో పాటు ఎంపీ, ముగ్గురు జడ్పీ చైర్మన్లు, కార్పొరేషన్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లతో పాటు అనేక మంది బీఆర్ఎస్ నుంచి వచ్చినా ఎన్నికల్లో వారి ప్రభావం పెద్దగా కనిపించలేదు. దీంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అధికార కాంగ్రెస్‌కు పెద్ద తలనొప్పిగా మారే అవకాశం ఉందన్న చర్చ సర్వత్రా సాగుతోంది.

నేటి నుంచి బడిబాట..

- బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించడమే లక్ష్యం
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్ 5 : రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, బడి ఈడు పిల్లలందరికీ మెరుగైన విద్యను అందించడమే లక్ష్యంగా సర్కారు ఏటా బడిబాట కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ నెల 3 నుంచి ప్రారంభం కావాల్సిన బడి బాట కార్యక్రమంలో లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు కారణంగా వాయిదా వేశారు. తిరిగి ఈ నెల 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ బడి బాటలో చిన్నారుల తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతను వివరించనున్నారు. ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ సామూహిక అక్షరాభ్యాసం, బాలికా విద్య ప్రాముఖ్యత తెలియజేస్తూ చదువుకు దూరమైన పిల్లలను పాఠశాలలకు తీసుకు రావటమే లక్ష్యంగా బడి బాట కార్యక్రమాన్ని తలపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి పాఠశాలలను బలోపేతం, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన చేయాలని నిర్ణయించింది. జిల్లా, మండల విద్యాధికారులు, మండల పరిషత్ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కీలక పాత్ర పోషించనున్నారు.

కార్యక్రమాలు ఇలా..

6వ తేదీ గ్రామస్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి, బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్చుకుంటామని ప్రతిజ్ఞ చేయడం, 7న ప్రతి ఇంటిని సందర్శించి పాఠశాలకు వచ్చే పిల్లల జాబితాను సిద్ధం చేయనున్నారు. 8 నుంచి 10వరకు బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం కల్పించి గ్రామస్థాయిలో రిజిష్టర్‌లో పేరు నమోదు చేయడం, గడప గడప ప్రచారం, అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, బడిబాటపై కరపత్రాలు, బ్యానర్లతో ప్రచారం, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి, పాఠశాలలో చేర్పించే కార్యక్రమాలు ఉన్నాయి. 11న గ్రామ సభలు నిర్వహించి, బడిబాట కార్యక్రమాన్ని సమీక్షించడం, బడికి రాకుండా మిగిలిపోయిన పిల్లలను, పాఠశాలల్లో నమోదు కాకుండా బడి బయట ఉన్న పిల్లలను గుర్తిస్తారు. 12న పాఠశాల సుందరీకరణ, పండుగ వాతావరణం నెలకొల్పడం, తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి, అమ్మ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన పనులను ప్రారంభించడం, పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, డ్రెస్‌ల పంపిణీ, 13న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలు, పుస్తకపఠనం, 14న సామూహిక అక్షరాభ్యాసం, బాలసభలు, క్విజ్ పోటీలు నిర్వహించడం, అక్షరాల గుర్తింపు, ప్రాథమిక గణిత కార్యకలాపాలు, 15న దివ్యాంగులను భవిత సెంటర్లలో, బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించడం, విద్యార్థుల ప్రవేశాలను పెంపొందించడం, 18న డిజిటలైజేషన్, ఆంగ్ల మాధ్యమంపై విద్యార్థులకు అవగాహన, 19న స్పోర్ట్స్‌డే నిర్వహించి, విద్యార్థులకు వివిధ క్రీడల్లో పాల్గొనేలా చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు(ఫైల్)

బడిబాటను విజయవంతం చేయాలి



బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, తహసీల్దార్లు, ఎంపీపీలు, ఎంపీడీవోలు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులను, సహాయక సంఘాలు, పంచాయతీ కార్యదర్శులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు భాగస్వామ్యం చేస్తూ గ్రామాల్లో చదువుకు దూరంగా ఉంటున్న బడీడు పిల్లలను గుర్తించి దగ్గరలోని అంగన్‌వాడీ, పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- సుశీందర్‌రావు, డీఈవో

నాయకులకు అడ్డాగా ఉమ్మడి కొత్తూర్

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా గెలిచిన అభ్యర్థులు
- వీర్లపల్లి గ్రామానికి ప్రత్యేక గుర్తింపు

కొత్తూర్, జూన్ 5 : నాయకత్వానికి మారుపేరుగా నిలుస్తోంది ఉమ్మడి కొత్తూర్ మండలం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గల షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూర్ మండలం రాజకీయాలకు వేదికగా మారింది. షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఈ మండలం నుంచే అట్టడుగు రాజకీయాల నుంచి వచ్చిన వ్యక్తులు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు. ఆరు దశాబ్దాల కాలంగా రాజకీయ రంగ ప్రవేశం చేసినవారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలుకొని నేటి తెలంగాణలో కూడా ఎన్నో కీలక పదవులను అధిష్ఠించారు. ఉమ్మడి కొత్తూర్ మండల రాజకీయ పరిణామాల నేపథ్యంలో సీనియర్ నాయకులతో పాటు యువ నాయకులు సైతం కొత్తూర్ మండలం నుంచి పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి కొత్తూర్ మండలంలోని వీర్లపల్లి, మామిడిపల్లి గ్రామాలకు రాజకీయంగా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది.



ఎం.రాందేవ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



వీర్లపల్లి శంకర్, షాద్‌నగర్ ఎమ్మెల్యే



నారగ్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ

ఇదీ రాజకీయ నేపథ్యం

వీర్లపల్లి గ్రామపంచాయతీ పరిధి అప్పారెడ్డిగూడకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎం.రాందేవ్‌రెడ్డి దేశంలో మొట్టమొదటిసారిగా షాద్‌నగర్‌లో ఏర్పడిన పంచాయతీ సమితీకి తొలి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1962వ సంవత్సరంలో ప్రస్తుత వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలు అందించారు. 1970వ సంవత్సరంలో మహబూబ్‌నగర్ లోకల్‌బాడీ ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఆ తరువాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌గా చైర్మన్‌గా ఎంపికయ్యారు.

ఎమ్మెల్యే శంకర్‌దీ ఇక్కడే ..

వీర్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీర్లపల్లి శంకర్ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అలాగే వీర్లపల్లి గ్రామపంచాయతీలోని అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన మెహన్‌రెడ్డి మండల వ్యవస్థ ఏర్పడిన తర్వాత కొత్తూర్ ఎంపీపీగా ప్రజలకు సేవలందించారు.

కొత్తూర్ టు నందిగామ

ఉమ్మడి కొత్తూర్ మండలంలో ఉన్న వీర్లపల్లి, మామిడిపల్లి గ్రామాలు మండలాల పునర్విభజనలో భాగంగా నందిగామ మండలంలో కలిశాయి. రాష్ట్ర రాజధానికి, అంతర్జాతీయ విమానాశ్రయానికి అతి చేరువలో ఉన్న ఉమ్మడి కొత్తూర్ మండలం పారిశ్రామికంగా, వ్యాపారపరంగా ఎంతో అభివృద్ధి చెందుతుండగా, మరోవైపు రాజకీయంగా కూడా రాష్ట్రస్థాయిలో పోటీ పడుతూ వస్తుంది.

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి స్వగ్రామం మొదళ్లగూడ

ఉమ్మడి కొత్తూర్ మండలంలోని మొదళ్లగూడ గ్రామానికి చెందిన (మామిడిపల్లి పాత గ్రామపంచాయతీ) నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా పోటీచేసి గెలుపొందారు. ఇదే గ్రామానికి చెందిన నాగర్‌కుంట ఎల్లారెడ్డి కూడా కొత్తూర్ మండల ఎంపీపీగా గెలుపొంది ప్రజలకు సేవలందించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

- డీఆర్‌డీవో పీడీ శ్రీలత



మంచాలలో మొక్కలు నాటుతున్న శ్రీలత

మంచాల, జూన్ 5 : పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్టు అధికారి శ్రీలత విజ్ఞప్తి చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మంచాల మండలంలో పచ్చదనం పరిశుభ్రత వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. ఇక్కడి ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంకుడు గుంతల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రతపై కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణం సమతుల్యంగా ఉండాలంటే ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. అన్ని ప్రభుత్వ ప్రదేశాల్లో విధిగా మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో అడిషనల్ పీడీ సుభాషిణి, ఎంపీడీవో బాలశంకర్, ఏపీవో వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం

వానాకాలం పంటల సాగు మొదలైంది. రెండు, మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలతో అదును కావడంతో జిల్లాలోని రైతులు సాగును ప్రారంభించారు. రోహిణి కార్తెలో జొన్న విత్తనాలు విత్తేందుకు అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందని భావించిన రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. కొంత మంది విత్తనాలు కూడా వేసుకుంటున్నారు. సీజన్ ప్రారంభంతో పొలం పనుల్లో రైతులు బిజీగా కన్పిస్తున్నారు. ఎరువులు, విత్తనాల దుకాణాలలో జోరుగా విక్రయాలు జరుగుతున్నాయి.

- ఆమనగల్లు, జూన్ 5



ఆమనగల్లులో జొన్న పంట సాగుకు దుక్కిని సిద్ధం చేస్తున్న రైతు

నేడు షాద్‌నగర్‌కు అరవింద్ భౌతికకాయం

16 రోజుల క్రితం ఆస్ట్రేలియాలో అనుమానాస్పద స్థితిలో మృతి

షాద్‌నగర్ రూరల్, జూన్ 5 : ఆస్ట్రేలియాలో మే 20న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన షాద్‌నగర్ పట్టణానికి చెందిన అరటి అరవింద్ యాదవ్ భౌతిక కాయం నేడు(గురువారం) షాద్‌నగర్‌కు రానుంది. 16 రోజుల క్రితం ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్‌వేల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సముద్రంలో అనుమానాస్పద స్థితిలో అరవింద్ శవమై కనిపించాడు. అక్కడి పోలీసులు కుటుంబ సభ్యులతో విచారణ చేసిన అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి పంపుతున్నారు. గురువారం షాద్‌నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.



అరటి అరవింద్ (ఫైల్)

షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంటులో
బీజేపీకి పెరిగిన ఓటు బ్యాంకు

- ఓట్లు తగ్గినా మెజారిటీ పెంచుకున్న కాంగ్రెస్
- చతికిలపడ్డ భారత రాష్ట్ర సమితి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 5: మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో అనూహ్యంగా భారతీయ జనతా పార్టీకి భారీగా ఓటు బ్యాంకు పెరిగింది. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీజేపీకి ఎనిమిదింతలు ఓట్లు పెరిగాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అందె బాబయ్యకు 8,078 ఓట్లు రాగా.. పార్లమెంట్ స్థానానికి పోటీ చేసిన డీకే అరుణకు 68,096 ఓట్లకు పెరిగాయి. దాంతో లోక్‌సభ ఎన్నికల్లో 60,018 ఓట్లు పెరిగాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్ ఇవ్వకపోవడంతో రెబల్ అభ్యర్థిగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి టికెట్ తెచ్చుకుని పోటీ చేసి 31,426 ఓట్లు తెచ్చుకున్న పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి.. తిరిగి బీజేపీలో చేరడం, ప్రధాని మోదీ గాలి వీయడంతో బీజేపీకి ఓటు శాతం భారీగా పెరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించిన వీర్లపల్లి శంకర్ 76,947 ఓట్లు పొంది, 7,128 ఓట్ల మెజార్టీని సాధించారు. లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన చల్లా వంశీచంద్‌రెడ్డికి 76,000 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల కంటే 947 ఓట్లు తగ్గినా 7,904 ఓట్లకు మెజారిటీ పెరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి రెండవ స్థానంలో నిలిచిన బీఆర్‌ఎస్ అభ్యర్థి వై.అంజయ్యయాదవ్‌కు 70,385 ఓట్లు వచ్చాయి. అదే లోక్‌సభ స్థానానికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తిరిగి పోటీ చేసిన మన్నె శ్రీనివాస్‌రెడ్డికి 31,560 ఓట్లు మాత్రమే వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల ఓట్ల కంటే లోక్‌సభకు 38,825 ఓట్లు తగ్గాయి. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని నిలుపుకోగా, బీజేపీ బలాన్ని పెంచుకుంది. బీఆర్‌ఎస్ మాత్రం సగానికి సగం ఓట్లను తగ్గించుకుని మూడోస్థానానికి పరిమితమైంది.

‘పట్నం’ అసెంబ్లీ సెగ్మెంటులో
ఘోరంగా దెబ్బతిన్న బీఆర్‌ఎస్

- అనూహ్యంగా పుంజుకున్న బీజేపీ.. ముందుండు మారనున్న సమీకరణాలు
- ఎంపీ ఎన్నికల ఫలితాలపై నాయకుల విశ్లేషణ

ఇబ్రహీంపట్నం, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడడంతో ప్రధాన రాజకీయ పార్టీలు తమకు వచ్చిన ఓట్లపై విశ్లేషణ చేసుకుంటున్నాయి. భువనగిరి పార్లమెంటరీ స్థానం ఇబ్రహీంపట్నం అసెంబ్లీ సెగ్మెంటులో గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పోల్చితే ఈసారి బీఆర్‌ఎస్ పార్టీ ఘోరంగా దెబ్బ తింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మొదటి స్థానంలో నిలవగా బీఆర్‌ఎస్‌ది రెండో స్థానం, బీజేపీ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. రెండు ఎన్నికల్లోనూ సీపీఎం పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ తగ్గినప్పటికీ మొదటి స్థానంలో నిలువగా బీజేపీ రెండో స్థానంలోకి వచ్చింది. ఇక్కడ బీఆర్‌ఎస్ మూడో స్థానానికి పడిపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి 1,24,447 పోలవగా బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి 84,320 ఓట్లు వచ్చాయి. అలాగే బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్‌కు 15,790 ఓట్లు పోలవగా సీపీఎం అభ్యర్థి పగడాల యాదయ్యకు 4,019 ఓట్లు వచ్చాయి. అప్పట్లో బీఆర్‌ఎఎస్ రెండో స్థానంలో నిలవగా కాంగ్రెస్, బీజేపీల మధ్య ఓట్ల తేడా 40,027గా ఉంది. కాగా, లోక్‌సభ ఎన్నికల విషయానికి వస్తే.. ఇదే అసెంబ్లీ సెగ్మెంటులో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి 88,013 ఓట్లు పోలవగా బీజేపీ అభ్యర్థి డా.బూర నర్సయ్యగౌడ్‌కు 84,044 ఓట్లు వచ్చాయి, బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌కు 39,541 ఓట్లు మాత్రమే వచ్చాయి. సీపీఎం అభ్యర్థి మహ్మద్ జహంగీర్‌కు 5,684 ఓట్లు పడ్డాయి. గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే బీఆర్‌ఎస్ ఓటింగ్ సగానికిపైగా పడిపోయింది. బీజేపీ ఓటింగ్ ఒక్కసారిగా పెరిగింది. దీనిని బట్టి బీఆర్‌ఎస్ ఓట్లు బీజేపీకి క్రాస్ అయ్యాయని స్పష్టంగా తెలుస్తోంది. నిజానికి క్యామ మల్లేష్‌కు ఇబ్రహీంపట్నం సొంత నియోజకవర్గం కావడంతో.. ఇక్కడ ఓట్లపై ఆయన ఎక్కువ ఆశలు పెట్టుకున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీల మధ్య ఓట్ల తేడా కేవలం 3,969 మాత్రమే.

మారనున్న రాజకీయ సమీకరణాలు

గతేడాది నవంబరు చివరన జరిగిన ఎన్నికలు, ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్లపై ఆయా రాజకీయ పార్టీలు విశ్లేషించుకుంటున్నాయి. బీజేపీ అనూహ్యంగా పుంజుకోవడంతో ముందుండు పరిస్థితులు ఏంటనేది వేచిచూడాల్సిందే. ఆయా పార్టీలో సమీకరణాలు వేగంగా మారనున్నాయని సమాచారం. ఇది వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ఎలాంటి ప్రభావం చూపనుందనేది కూడా జోరుగా చర్చ కొనసాగుతోంది.

కార్పొరేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలి

శంషాబాద్ రూరల్, జూన్ 5 : కార్పొరేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని టీఎస్ఎస్వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ బుధవారం డీఈవో సుశీందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని జూకల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన డీఈవోకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనివాస్ మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థలకు చెందిన




డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న లక్ష్మీనివాస్

పాఠశాలలు, కళాశాలల్లో లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, పలు ప్రాంతాల్లో ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్లపై తిరుగుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయని అన్నారు. ప్రయివేట్ పాఠశాల్లో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు అధిక ధరలకు అమ్ముతున్నారని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన డీఈవో తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలోనే ఎంఈవోతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. టీఎస్ఎస్వో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంశీ, సచిన్, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య.. ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం

సజావుగా ఎన్నికల ప్రక్రియను ముగించిన అధికారులు



మేడ్చల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కాస్త ఊపిరి పీల్చుకునే లోపే పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై చివరకు కౌంటింగ్ కూడా సజావుగా పూర్తి కావడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. నామినేషన్‌ల స్వీకరణ మొదలుకొని పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఉద్యోగులు భాగస్వాములై విజయవంతం చేశారు. రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన కలెక్టర్ గౌతమ్ నియోజకవర్గాల ఏఆర్‌ఓలతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లారు. ఉపాధ్యాయులు, రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది ఈ ప్రక్రియలో పాలుపంచుకున్నారు. మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి 22మంది అభ్యర్థులు పోటీ చేశారు. నామినేషన్ల ప్రక్రియ నుంచి ఉన్నతాధికారి మొదలు సిబ్బంది వరకు కష్టపడి పని చేశారు. రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారులు, సెక్టోరియల్, ప్రిసైడింగ్ అధికారులు, సూక్ష్మపరిశీలకు, బీఎల్ఓలు ఎన్నికల నిర్వహణలో ప్రధాన భూమిక పోషించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా నిఘా బృందాలు నిరంతరం పనిచేశాయి. ఓట్ల లెక్కింపులోనూ అధికారులు సమన్వయంతో పనిచేశారు. ఉదయం 5గంటలకే పోలింగ్ సిబ్బంది కీసరలోని హోలీమేరీ ఇంజినీరింగ్ కాలేజీకి చేరుకున్నారు. మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టి నియోజకవర్గాల వారీగా ఉద్యోగులను కేటాయించారు. ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో లెక్కింపు ప్రక్రియ ప్రారంభించారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ నిరంతరం పర్యవేక్షించారు. సహాయ రిటర్నింగ్ అధికారులు సిబ్బందితో లెక్కింపు ఆలస్యం కాకుండా చూశారు. పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకున్నారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్వో హరిప్రియ, ఎన్నికల విభాగం అధికారి రాజేశ్వర్‌రెడ్డి తమవంతు బాధ్యతలు నిర్వహించారు. సిబ్బందికి ఎప్పటికప్పుడు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ నుంచి ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలించే వరకు ప్రణాళికాబద్ధంగా పనిచేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- స్థానిక సంస్థలకు అండగా ఉంటా
- ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి



షాద్‌నగర్ అర్బన్, జూన్ 5: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు అండగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం చేస్తానని మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి తెలిపారు. ఆయన స్వగ్రామమైన నందిగామ మండలం మొదళ్లగూడలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నవీన్‌రెడ్డిని ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వార్డు సభ్యుడిగా, ఉప సర్పంచ్‌గా, జడ్పీటీసీ, జడ్పీ వైస్ చైర్మన్‌గా పని చేసిన తనకు స్థానిక సంస్థల సమస్యలు బాగా తెలుసునని అన్నారు. అధికార పార్టీ బలాన్ని తట్టుకుని గెలవడానికి కేసీఆర్ ఆశీర్వాదం, కేటీఆర్‌తో పాటు ఇద్దరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, 12 మంది మాజీ ఎమ్మెల్యేల సహకారం లభించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కేసీఆర్ తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. రాజకీయాలు ఎన్నికలకే పరిమితం చేయాలని, గెలిచిన తరువాత ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలే తప్ప.. ప్రతిపక్ష నాయకులే టార్గెట్‌గా కక్షసాధింపు, కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని కోరారు.



పార్టీలో చేరినవారికి కండువాలు కప్పుతున్న బక్కని నర్సింహులు

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

మొయినాబాద్ రూరల్, జూన్ 5: దివంగత నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్) ఆశయ సాధనకు కృషి చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. బుధవారం మొయినాబాద్ మండల కేంద్రంలో అజీజ్‌నగర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు బక్కని ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగుజాతి అభివృద్ధి, సంక్షేమానికి పరితపించేది కేవలం టీడీపీ మాత్రమేనని, పార్టీలోకి చేరికలు కొనసాగడం సంతోషకరమని అన్నారు. నాయకులు పద్మారావు, మాణిక్యం, ఎల్లని యాదయ్య, సుభాన్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాజు గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, గోపాల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాల్‌లో ముమ్మరంగా వాహనాల తనిఖీ

యాచారం, జూన్ 5 : అక్రమంగా పాడిపశువుల రవాణా, విత్తనాల క్రయ విక్రయాలను నివారించడం కోసం కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు చెప్పారు. బుధవారం మాల్‌లో ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. పాడిపశువులను అక్రమంగా రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాలుగు రోజుల్లో 30 పాడిపశువులను పట్టుకొని గోశాలకు తరలించామని చెప్పారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల తనిఖీకి వాహనాదారులు సహకరించాలని కోరారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

యాచారం, జూన్ 5: దీర్ఘకాలికంగా కేంద్రీయ మెట్టవ్యవసాయ పరిశోధనా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేసి ఆదుకోవాలని జిల్లా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి, పి.బ్రహ్మయ్యలు డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.26వేలు అందించాలని డిమాండ్ చేశారు. కూలీలకు యూనిఫాం, గుర్తింపుకార్డులు ఇవ్వాలని కోరారు. కనీసం 8.33శాతం బోనస్ ప్రతీయేటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రం గున్‌గల్ ఇన్‌చార్జి కార్మికులను బెదిరించడం దారుణమన్నారు. ఈమేరకు కేంద్రీయ మెట్టవ్యవసాయ పరిశోధనా కేంద్రం వద్ద ధర్నా చేశారు. నాయకులు లక్ష్మమ్మ, యాదమ్మ, గణేష్, పెద్దయ్య, శ్రీకాంత్, కృష్ణ, శివుడు, బాలకృష్ణ, రాములు, చందూనాయక్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు సీఐటీయూ కార్యకర్తలు

మొక్కలు నాటి సంరక్షించాలి

● అధికారులు, ప్రజాప్రతినిధులు ● ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని మొక్కలు నాటిన ఉపాధి కూలీలు



యాచారం : మల్కీజ్‌గూడలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ సుకన్యబాషా, పాల్గొన్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి ఉపాధి కూలీలు



కేశంపేట : ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి



కొత్తూర్ : పెంజర్లలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో అరుంధతి

యాచారం, జూన్ 5 : గ్రామగ్రామాన మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించారు. ప్రతీ వ్యక్తి నాలుగు మొక్కలు నాటి సంరక్షించాలని యాచారం ఎంపీపీ కొప్పు సుకన్యబాషా, ఎంపీడీవో నరేందర్‌రెడ్డిలు కోరారు. అటవీ సంపద తగ్గడంతోనే సకాలంలో వర్షాలు కురియడం లేదని వారు చెప్పారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం యాచారం మండలంలోని మల్కీజ్‌గూడలో ఎంపీపీ, ఎంపీడీవోలు మొక్కలు నాటారు. యాచారం, చౌదర్‌పల్లి, నజ్దిక్‌సింగారం, తాటిపర్తి, చిన్నతూండ్ల, కుర్మిద్ద, గునగల్, మాల్ తదితర గ్రామాలలో ఉపాధి కూలీలు, రైతులు, వివిధ శాఖల అధికారులు మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల : అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

కొత్తూర్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులు మొక్కలు నాటడంతో పాటు, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో స్థానిక ఎంపీడీవో అరుంధతి మొక్కలు నాటారు. అలాగే మండల పరిధిలోని మల్లాపూర్, మక్తగూడ గ్రామంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో ఎంపీవో విజయలక్ష్మి, సురేందర్, రాణి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : ప్రతీఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని చేవెళ్ల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి తెలిపారు. బుధవారం చేవెళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనంతోనే ప్రగతి కన్పిస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని కేశంపేట మండల పరిషత్ అధికారి రవిచంద్రకుమార్‌రెడ్డి కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామ పంచాయతీ అమృత్ సరోవర్ చెరువు వద్ద ఉపాధి హామీ కూలీలతో మొక్కలు నాటించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ పర్యావరణం కలుషం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షపు నీరు వృథా కాకుండా మ్యాజిక్ సోప్ పిట్లు ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని సూచించారు. అలాగే వేముల్‌నర్వ, ఇప్పలపల్లి, దేవునిగుడి తండా, కొండారెడ్డిపల్లి గ్రామాలలో నర్సరీలను పరిశీలించారు.

12 వరకు పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమాలు

ఈనెల 5 నుంచి 12 వరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని గ్రామాలలో ప్రత్యేక పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని రవిచంద్రకుమార్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. హరితహారంలో భాగంగా లక్షా నాలుగు వేల మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నర్సింహ, ఉపాధిహామీ పథకం అధికారి అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటాలి

యాచారం, జూన్ 5 : ఖాళీ స్థలాలు, పాఠశాలలు, కళాశాలల్లో, రోడ్లుకిరువైపులా విరివిగా మొక్కలు నాటాలని ఇబ్రహీంపట్నం ఉపాధి హామీ పథకం ఏపీడీ సక్రియా అన్నారు. బుధవారం యాచారం మండలంలోని నందివనపర్తిలో హరితహారం నర్సరీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండిన మొక్కల స్థానంలో కొత్తగా మొక్కలు నాటించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఒక్క మొక్క కోసం రూ.30 వ్యయమవుతుందని చెప్పారు. ప్రతీ గ్రామంలో పదివేల మొక్కలు నాటించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. యాచారం మండలంలో రెండు లక్షల మేర మొక్కలు నాటడం కోసం కార్యాచరణ రూపొందించామని చెప్పారు. ఎల్టీ, 11 కేవీ విద్యుత్ వైర్ల కింద ఎట్టి పరిస్థితుల్లో మొక్కలు నాటరాదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మొక్కలు ఎండిపోకుండా ట్రాక్టర్‌తో నీరు పెట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఆయనతో ఏపీవో లింగయ్య తదితరులు ఉన్నారు.



నందివనపర్తిలో నర్సరీని తనిఖీ చేస్తున్న ఏపీడీ సక్రియా

క్రైం కార్నర్

దొంగతనం కేసులో సేల్స్‌మెన్‌లే నిందితులు

● పాత నరస్థుడితో కలిసి షాపులో చోరీ
● రూ.3.16 లక్షల నగదు.. తులం బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం, జూన్ 5: ఇబ్రహీంపట్నం టౌన్ మంచాల రోడ్డులో శనివారం రాత్రి ఓ కిరణా షాపులో దొంగతనానికి పాల్పడింది పాత నేరస్థుడితో కలిసి షాపులో పనిచేసే సేల్స్‌మెన్లేనని పోలీసులు తేల్చారు. ఈ మేరకు బుధవారం వారిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలను ఏసీపీ కేపీవీ రాజు బుధవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. మంచాల రోడ్డులో గుద్దేటి నగేష్‌కు చెందిన బాలాజీ కిరాణా షాప్‌లో శనివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత చోరీ జరిగింది. షాపు వెనకాల ఉన్న డోర్ తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన నిందితులు లాకర్ తాళాలు తీసి అందులో ఉన్న రూ.3.16 లక్షల నగదుతోపాటు పాటు తులం బంగారం దొంగిలించారు. ఆదివారం ఉదయం నగేష్‌చూసి పోలీసులకు పిర్యాదు చేయగా.. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. షాపు ముందున్న సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా షాపులో పనిచేసే పవన్, వినయ్‌లను విచారించగా ఓ పాత నేరస్థుడితో కలిసి వీరే దొంగతనానికి పాల్పడినట్లు తేలింది. వనపర్తి జిల్లా బజ్జపల్లి గ్రామానికి చెందిన మైలారం పవన్‌కుమార్ కొంతకాలంగా ఇబ్రహీంపట్నంలో ఉంటున్నాడు. అలాగే ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన చింతల వినయ్‌కుమార్‌తో కలిసి ఇదే షాపులో సేల్స్‌మ్యాన్‌గా పనిచేస్తున్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఒలిండకొండ గ్రామానికి చెందిన చెందిన వడ్డె వెంకటేష్ కొంతకాలంగా బంజారాహిల్స్‌లో నివాసముంటూ కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో వెంకటేష్ జల్సాలకు అలవాటుపడి చిన్న చిన్న దొంగతనాలు చేస్తున్నాడు. 2017లో జడ్చర్ల బస్టాండులో పార్కు చేసిన ఓ బైక్‌ను దొంగిలించిన కేసులో వెంకటేష్ జైలుకు వెళ్లాడు. 2018, 2023లో జరిగిన దొంగతనం కేసుల్లో బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో అతనిపై కేసులు నమోదైనాయి. కాగా, పవన్‌కు ఎప్పటి నుంచో వెంకటేష్‌తో స్నేహం ఉంది. నేరుగా తామే దొంగతనానికి పాల్పడితే దొరికిపోతామని భావించిన పవన్, వినయ్‌లు వెంకటేష్‌తో కలిసి దొంగతనానికి స్కెచ్ వేశారు. శనివారం అర్ధరాత్రి తర్వాత షాపు వెనకాల ఉన్న డోర్ తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన వెంకటేష్ లాకర్‌లో ఉన్న రూ.3.16 లక్షల నగదు, తులం బాంగారు కాయిన్‌ను దొంగిలించి తాను వచ్చిన వ్యాన్‌లో పరారయ్యాడు. సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా సేల్స్‌మెన్స్ అయిన పవన్, వినయ్‌లను అదుపుతోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. దీంతో ముగ్గురు నిందితులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ సత్యనారాయణ, ఎస్సై మారయ్యలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల నిరోధానికి పకడ్బందీ చర్యలు

ఆమనగల్లు, జూన్ 5:న కిలీ విత్తనాల నిరోధానికి ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని ఆమనగల్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అరుణకుమారి అన్నారు. విత్తన, ఎరువుల డీలర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలని ఆమె ఆదేశించారు. ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో బుధవారం ఎరువులు, విత్తన దుకాణాలను ఏవో అరుణకుమారి తనిఖీ చేశారు. విత్తన, ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. విత్తనాల కృత్రిమ కొరత సృష్టించిన, అధిక ధరలకు విక్రయించిన చర్యలు తప్పవన్నారు.



బిల్లులను పరిశీలిస్తున్న ఏవో అరుణకుమారి

విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలి

తలకొండపల్లి : రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు డీలర్లు అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజు సూచించారు. విక్రయించిన విత్తనాలకు రైతులకు రశీదులు ఇవ్వాలని కోరారు. తలకొండపల్లి మండల కేంద్రంతో పాటు వెల్జాల గ్రామంలో ఎరువుల, విత్తన దుకాణాలను ఏవో తనిఖీ చేశారు. రికార్డులను, విత్తన నిల్వలను పరిశీలించారు. డీలర్లు నిబంధనల మేరకు నడుచుకోవాలని తెలిపారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

ఆమనగల్లు, జూన్ 5: అమ్మఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీకాంత్ కోరారు. విద్యా సంవత్సరం పునఃప్రారంభం నాటికి చేపట్టిన పనులు పూర్తయ్యేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. ఆమనగల్లు మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై తలకొండపల్లి, ఆమనగల్లు, మండలాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంఈవో సర్ధార్ నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాఠశాలల పురోగతిపై పాఠశాలల వారిగా ఎంపీడీవో శ్రీకాంత్ సమీక్షించారు. పనుల నిర్వాహణలో ఎక్కడ అలసత్వానికి తావుండకూడదని కోరారు.

'బడిబాట'ను విజయవంతం చేయాలి

శంకర్‌పల్లి, జూన్ 5 : బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో వెంకయ్యగౌడ్ తెలిపారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. నేటి (గురువారం) నుంచి ఈనెల 16 వరకు జరిగే బడిబాట కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బడీడు పిల్లలు, బడిబయట గల పిల్లలను బడిలో చేర్పించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. బాలకార్మికులను సైతం పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందని, త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మోకిల సీఐ వీరబాబు, శంకర్‌పల్లి ఎస్సై సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాతున్న ఎంపీడీవో వెంకయ్య గౌడ్

ఎంపీ రఘువీర్‌రెడ్డిని కలిసిన వైస్ ఎంపీపీ జక్కు అనంత రెడ్డి



ఆమనగల్లు, జూన్ 5: నల్లగొండ ఎంపీగా గెలుపొందిన కందూరు రఘువీర్‌రెడ్డిని బుధవారం ఆమనగల్లు వైస్ ఎంపీపీ జక్కు అనంత రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నల్లగొండలో ఆయన్ను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడు లేనివిధంగా 5.59 లక్షల మెజార్టీతో రఘువీర్‌రెడ్డి విజయం సాధించడం జానారెడ్డి కుటుంబం, కాంగ్రెస్ పట్ల ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శమని అనంతరెడ్డి అన్నారు.

నేడు మదన్‌పల్లి శనైశ్చరాలయంలో అమావాస్య ప్రత్యేక పూజలు

శంషాబాద్ రూరల్, జూన్ 5 : మండల పరిధిలోని మదన్‌పల్లి శనైశ్చరాలయంలో అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని, పలువురు ప్రముఖులు హాజరు కానున్నారని ఆలయ చైర్మన్ స్వామిజీ శ్రీ శంకరాజు ముఖియా బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు(గురువారం) అమావాస్య రోజున శనీశ్వరుడి పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని స్వామిజీ పేర్కొన్నారు. ఆయన పుట్టినరోజు పూజలు నిర్వహిస్తే సకల శనిదోశాలు తొలగిపోతాయన్నారు. ఉదయం నుంచి శనైశ్చరుడికి పాలాభిషేకం, జలాభిషేకం, పుష్పాభిషేకం, హోమం తదితర పూజలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. నగర శివారు ప్రాంతం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొననున్న పేర్కొన్నారు. ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని స్వామిజీ తెలిపారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. కాగా, అమావాస్య, శనైశ్చరుడి పుట్టినరోజు ఒకేరోజు రావడం ఇది పదేళ్లలో ఒక్కసారి మాత్రమే జరుగుతుందని, ఇలాంటి సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తే పదేళ్ల నుంచి పట్టిన శని తొలగిపోతుందని స్వామిజీ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



శనైశ్చరుడి మూలవిరాట్

విద్యార్థులు ఉన్నతంగా చదివి తల్లిదండ్రులకు పేరు తేవాలి

యాచారం. జూన్ 5 : ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తేవాలని, విద్యతోనే జీవితం సాఫీగా సాగుతుందనే విషయం గమనించాలని యాచారం ఎస్సై వెంకటనారాయణ విద్యార్థులకు సూచించారు. మండలంలోని చింతపట్ల ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శిబిరంలో ఆంగ్లంపై అవగాహన, వాలీబాల్ క్యాంప్ పెట్టి విద్యార్థులను తీర్చిదిద్దడం అభినందనీయమని చెప్పారు. మన ఊరు మన బడి కార్యక్రమంతో పాఠశాల పురోభివృద్ధికి ప్రతీఒక్కరు చొరవ తీసుకోవాలన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించి అభినందించారు. జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అనిరుద్రారెడ్డి, టీచర్లు ఎండీ సాబేర్, వేణు, చరణ్. భిక్షపతి, నరేందర్, ముత్యాలు, సుధాకర్‌రెడ్డి, జహంగీర్ తదితరులున్నారు.

టీడీపీ నాయకుల సంబురాలు



టపాకాయలు పేల్చుతున్న నాయకులు

మంచాల, జూన్ 5 : ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ విజయదుంధుబి మోగించడంపై బుధవారం పార్టీ నేతలు మంచాల మండలంలో సంబురాలు చేసుకున్నారు. మంచాల బస్టాండ్ చౌరస్తాలో టపాకాయలు కాల్చి వేడుకలు జరుపుకున్నారు. టీడీపీ రాష్టనేత జక్క రాంరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోనూ టీడీపీకి పూర్వవైభవం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. యార మహేందర్, లక్ష్మణ్‌జీ, కె.వెంకట్‌రెడ్డి, పగడాల ఆనంద్, పొలమోనిమల్లేష్, భద్రయ్య, వంగాల కృష్ణ, ప్రభాకర్, భిక్షపతి, వీరాచారి తదితరులున్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

కేశంపేట, జూన్ 5: పోమాల్‌పల్లికి చెందిన పబ్బె లక్ష్మమ్మ ఇటీవల మృతిచెందింది. ఈ విషయం గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణయ్య, ఉప సర్పంచ్ అనుమగళ్ల రమేష్ కేశంపేట జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన జడ్పీటీసీ రూ. 5వేలు నగదు పంపించారు. జడ్పీటీసీ అందించిన నగదుతో పాటు సర్పంచ్, ఉపసర్పంచ్‌లు మరో రూ. 5వేలు సమకూర్చి బాధిత కుటుంబానికి బుధవారం అందించారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి, ముత్యాల్ రెడ్డి, శ్రీనివాసులు, రాజు, పబ్బె చంద్రయ్య, అంజయ్య, వెంకటయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో నయా జోష్

● ఎంపీలను సన్మానించిన నాయకులు



షాబాద్ : విశ్వేశ్వర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి





షాద్‌నగర్ అర్బన్/కొత్తూర్ : డీకే అరుణకు అభినందనలు చెబుతున్న నాయకులు



షాద్‌నగర్ అర్బన్ : ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 5: మహబూబ్‌నగర్ లోక్ సభ స్థానంతో పాటు రాష్ట్రంలో మొత్తం ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలువడం, మూడోసారి ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేపట్టబోతుండడంతో షాద్‌నగర్ బీజేపీలో జోష్ పెరిగింది. ఎన్నికల ఫలితాలు వెలువడగానే మంగళవారం సాయంత్రం పోటాపోటీగా ర్యాలీలు నిర్వహించి, టపాసులు కాల్చి, స్వీట్లు పంచారు. బుధవారం మహబూబ్‌నగర్, మల్కాజ్‌గిరి, మెదక్ ఎంపీ సభ్యులు డీకే అరుణ, ఈటల రాజేందర్, రఘునందన్‌రావులను కలిసి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అందె బాబయ్య, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, దేపల్లి అశోక్‌గౌడ్, అమడాపురం నర్సింహ్మగౌడ్, వంశీకృష్ణ, ప్యాట అశోక్, చెట్ల వెంకటేష్, మురళి, హరిభూషన్, సాయికుమార్ తదితరులున్నారు.

డీకే అరుణకు నాయకుల సన్మానం

కొత్తూర్, జూన్ 5:మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా నూతనంగా ఎన్నికైన డీకే అరుణను బీజేపీ పార్లమెంట్ కోకన్వీనర్ అమడపురం నర్సింహగౌడ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బుధవారం హైద్రాబాద్‌కు తరలివెళ్లి శాలువలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. బీజే పీ నాయకులు దేపల్లి ఆశోక్‌గౌడ్, ఎర్రవెల్లి నాగరాజు చారి, శ్రీశైలం, బోడ్డు జగన్, రవితేజ, మల్లేష్ తదితరులు డీకే అరుణను కలిసిన వారిలో ఉన్నారు.

భవిష్యత్తు బీజేపీదే

షాబాద్ : రాబోయే రాజకీయ భవిష్యత్తు బీజేపీదేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.వెంకట్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావులను నగరంలో బీజేపీ సీనియర్ నాయకుడు ప్రభాకర్‌రెడ్డితో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ఘనవిజయం సాధించిందటే కార్యకర్తలు, నాయకుల సమష్టి కృషితోనే అనా అన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు బీజేపీ వెంట ఉన్నారని, అందుకే బీజేపీ విజయం సాధ్యమైందన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందన్నారు. బీఆర్ఎస్ కంచుకోటగా చెప్పుకునే మెదక్‌లో జెండా ఎగరవేశామన్నారు.

కొండా భారీ మెజార్టీతో గెలవడం హర్షణీయం

చేవెళ్ల : చేవెళ్ల నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో విజయం సాధించడం పట్ల ఆ పార్టీ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన చేవెళ్లలో మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తల సమష్టి కృషితో భారీ మెజార్టీ సాధించగలిగామన్నారు. బీజేపీ గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. నరేంద్రమోదీ చరిష్మాతోనే రాష్ట్రంలో అత్యధిక స్థానాలు బీజేపీ గెలుచుకోగలిగిందన్నారు.

కాంగ్రెస్ ప్రజాపాలనతో పెరిగిన ఓట్ల శాతం

● నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి


కడ్తాల్, జూన్ 5: రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు సాగించినా లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారని, ప్రజాపాలనతో రాష్ట్రంలో ఓటింగ్ శాతం పెరిగిందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వంద రోజుల పాలనకు ప్రజలు పట్టం కట్టారని, అందుకే నాలుగు స్థానాలు ఉన్న కాంగ్రెస్ ఈసారి 8 స్థానాలను కైవసం చేసుకుందని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించిన మల్లు రవిని బుధవారం కడ్తాల మండల కాంగ్రెస్ నాయకులు గూడూరు భాస్కర్‌రెడ్డి, హన్మనాయక్, వేణుగోపాల్, జహంగీర్‌అలీ, లక్‌పతి నాయక్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి అభినందించారు. రవి మాట్లాడుతూ ప్రజలు తనకు ఇచ్చిన అవకాశాన్ని బాధ్యతగా భావించి సేవకుడిగా పనిచేస్తానని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డిని ఒప్పించి నియోజకవర్గానికి అధిక నిధులు రాబడుతానన్నారు. నాయకులు లక్ష్మణ్‌నాయక్, ఆనంద్ నాయక్, కృష్ణ, తదితరులు ఉన్నారు.



మల్లు రవిని అభినందిస్తున్న నాయకులు

మేడిపల్లిలో కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు

యాచారం, జూన్ 5: కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముచ్చర్ల సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్ రెడ్డి విజయం పట్ల మంగళవారం రాత్రి యాచారం మండలంలోని మేడిపల్లిలో కార్యకర్తలు గ్రామంలో ర్యాలీ నిర్వహించి టపాసులు కాల్చి మిఠాయిలు పంచి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. మండల ఉపాధ్యక్షుడు జమ్మగుండాలు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు తాండ్ర మహేష్, బీసీ సెల్ అధ్యక్షుడు బండ రాజు, నాయకులు తదితరులున్నారు.



మేడిపల్లిలో సంబరాలు జరుపుకుంటున్న కార్యకర్తలు

ఘనంగా వరుణ యాగం

తలకొండపల్లి, జూన్ 5: మండల పరిధిలోని వెల్జాల వేదాద్రి శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో వరుణ యాగం ఘనంగా నిర్వహించారు. వరుణ దేవుడు కరుణించి విస్తారంగా వర్షాలు కురువాలని, పాడి పంటలు సమృద్ధిగా పండి రైతులు కష్టాలు తొలగాలని కోరుతూ చేపట్టిన యాగంలో స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గూడ నర్సింహశర్మ, తాతాభట్ల నర్సింహ్మశర్మ, శ్రీనివాస శర్మ, శరత్‌చంద్రశర్మ, ఆదిత్య మురళీధర్ శర్మ, సంతోష్ శర్మ, గోపి శర్మ, శంకర దత్త శర్మల ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా వరుణ యాగం నిర్వహించారు. మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు కొనసాగాయి. ఎంపీటీసీ అంబాజీ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవి, రమేశ్‌యాదవ్, వెంకటేశ్వర్‌రావు, సురేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్, బాలకుమార్ గౌడ్, శ్రీ రామ్, చంద్రయ్య, సంజీవ్, కృష్ణయ్య, తదితరులుపాల్గొన్నారు.



యాగం నిర్వహిస్తున్న వేదపండితులు, పాల్గొన్న భక్తులు

మురుగు నీటితో రాకపోకలకు ఇబ్బంది



కిందపడిన గర్భిణీకి సాయం చేస్తున్న మహిళ

ఆమనగల్లు, జూన్ 5: మున్సిపాలిటీ పరిధిలోని సందబావి వద్ద ఆమనగల్లు-మాడ్గుల ప్రధాన రహదారిపై మురుగు నీరు నిలిచి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శాంతినగర్ కాలనీ నుంచి వచ్చే అంతర్గత మురుగు కాల్వ పైపులైన్ పాడై మురుగు నీరు పారుదల లేక రోడ్డుపై నిలుస్తున్నాయి. వాహనదారులు రోజుల తరబడి ఇక్కట్లకు గురవుతున్నారు. బుధవారం ఆసుపత్రికి వస్తున్న ఓ గర్భిణీ బైక్ పైనుంచి పడటంతో స్వల్పంగా గాయపడింది. మున్సిపాలిటీ, ఆర్అండ్‌బీ శాఖల పట్టింపులేని ధోరణిపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.